క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలలో ఏటీడబ్ల్యూఓ తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏటీడబ్ల్యూఓ

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెం ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలను ఏటీడబ్ల్యూఓ సత్యవతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, బోధనాతీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థులకు పతకాలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2024లో తమ పాఠశాల విద్యార్థులు జి.కర్ణిక, జి.త్రినయన్ ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ పవిత్ర, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'కు అటానమస్ హోదా

ఖమ్మంరూరల్: మండలంలోని పాన్నేకల్‌లో గల శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ, జేఎన్‌టీయూల నుంచి అటానమస్ హోదా లభించిందని కళాశాల చైర్మన్ ఎం.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లపై దృష్టి సారిస్తుండడంతో ఈ హోదా లభించినట్లు తెలిపారు.

వినికిడి పరికరం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని బుద్ధారం ప్రాథమిక పాఠశాల విద్యార్థిని బోయిన నందితకు సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన వినికిడి పరికరాన్ని మంగళవారం మండల విద్యాశాఖాధికారి చలపతిరావు చేతుల మీదుగా అందించారు. విద్యార్థినికి వినికిడి లోపం ఉందని గుర్తించిన విద్యాశాఖాధికారులు జిల్లా అధికారులకు తెలపడంతో పరికరాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు షరీఫ్, భాగ్యలక్ష్మి, జైపాల్, మంగమ్మ, చారీ, సాంబశివరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మధురానగర్ విద్యుత్ 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు(బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మమత సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాఘవయ్యనగర్, నేతాజీనగర్, శ్రీనగర్‌నగర్ 1వ లైన్, జట్ల కాంప్లెక్స్, గొల్లగూడెంరోడ్, చెరుకూరి మామిడితోట రోడ్, మధురానగర్–1లలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 11 కేవీ పాకబండ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా మధ్యాహ్నం 11.30 నుంచి 2 గంటల వరకు పులిపాటినగర్, సాయినగర్, మధురానగర్ 1 నుంచి 15 వరకు, హనుమాన్ నగర్, గొల్లగూడెం రోడ్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

లిఫ్ట్‌కు మరమ్మతులు చేపట్టాలని వినతి

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు పెద్ద చెరువుకు సంబంధించిన జవహర్‌లాల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ పెద్దచెరువు ఆయకట్టు రైతులు మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ లకావత్ సక్రియా, దమ్మాలపాటి సత్యనారాయణ, ఇంజం నాగభూషణం, గుగులోత్ భాషా, లకావత్ మాన్‌సింగ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	లైలా
ఆదిత్య	బ్రహ్మా ఆనందం
శ్రీనివాస	కెప్టెన్ అమెరికా

– ఖమ్మంగాంధీచౌక్

ఇక పంట లెక్క పక్కా..!



అనంతనగర్‌లో సర్వే చేస్తున్న ఏఈఓ అవినాష్

కొనసాగుతున్న డిజిటల్ సర్వే

- పొలంబాట పట్టిన ఏఈఓలు
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన
- పంట చేతికొచ్చేలోగా ఆన్‌లైన్ నమోదు
- తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు

నేలకొండపల్లి: యాసంగి పంటల సర్వే ఆన్‌లైన్ నమోదు (డిజిటల్ క్రాప్ సర్వే) ప్రక్రియ మొదలైంది. గత సీజన్‌లో తమవల్ల కాదని మొండికేసిన విస్తీర్ణాధికారులు(ఏఈఓ) ఇప్పుడు పొలంబాట పట్టారు. విడతల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని పంట చేతికొచ్చేలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం పాలేరు నియోజకవర్గంలో 29 క్లస్టర్లలో ఒక్కో విస్తీర్ణాధికారి తమ పరిధిలోని గ్రామాల్లో సర్వే మొదలు పెట్టారు. పాలేరు డివిజన్ వ్యాప్తంగా 51,472 ఎకరాలలో పంటలు సర్వే చేయాల్సి ఉంది. ఇందులో చాలా వరకు సర్వే పూర్తి కావొచ్చింది.

ఏఈఓలకు 2 వేల ఎకరాలు..

ఈ సీజన్‌లో ఇప్పటి వరకు పాలేరులో 51,472 ఎకరాల పంటల విస్తీర్ణం ఉండగా.. అందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయలు ఇతర పంటలు సాగు చేస్తున్నారు. పాలేరును 29 క్లస్టర్లుగా విభజించి వాటిలో 28 మంది క్లస్టర్లు పనిచేస్తున్నారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం క్లస్టర్ ఏఈఓ పోస్టు మాత్రమే ఖాళీగా ఉంది. పాలేరు డివిజన్ వ్యాప్తంగా 59,380 సర్వేలలో పంట క్షేత్రాలు ఉన్నట్లుగా గుర్తించారు. మహిళా ఏఈఓలకు 1800 ఎకరాలు, పురుషులకు 2 వేల ఎకరాలు చొప్పున డిజిటల్ సర్వే చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

20 మీటర్ల పరిధిలో ఉంటేనే..

ఇది వరకు పంటల సర్వే (క్రాప్ బుకింగ్ సర్వే) అంచనాలతో లెక్కలేసేవారు. ఇప్పుడు క్షేత్రస్థాయికి వెళ్తేనే డిజిటల్ యాప్‌లో నిక్షిప్తమవుతుంది. అది కనీసం 20 మీటర్ల దూరంలో ఉంటేనే సంబంధిత శాటిలైట్ ద్వారా సేకరణ సాధ్యమవుతుంది. తీసిన ఫొటో సర్వే నంబర్, పంట, సిబ్బందితో సహా ఫొటోలో నిక్షిప్తమవుతుంది. దీంతో సిబ్బందికి కొంత ఇబ్బంది అయినా పక్కాగా వివరాలు నమోదు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. నెట్‌వర్క్ సమస్యలతో సర్వర్ బిజీగా వస్తుందని ఏఈఓలు అధికారుల దృషికి తీసుకొస్తున్నారు. పంట నమోదు కోసం ఎండల్లో పొలంగట్లపై అష్టకష్టాలు పడుతున్నారు. పని చేద్దామన్నా.. సాంకేతిక సమస్యలతో పని ముందుకు సాగక తలలు పట్టుకుంటున్నారు. కాగా, మొదట్లో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వ్యవసాయ శాఖ పరిష్కరించింది. దీంతో ఇటీవల సర్వే మళ్లీ ఊపందుకుంది.

జిల్లాలోనే మొదటి స్థానం..



డిజిటల్ పంటల నమోదు సర్వేలో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉన్నాం. ఇప్పటి వరకు దాదాపు 60 శాతానికి పైగా సర్వే పూర్తి చేశాం. సర్వేలో ఏఈఓలు చురుగ్గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని సకాలంలోనే పూర్తి చేస్తాం.

– ఎం.రాధ, ఏఓ, నేలకొండపల్లి

పరీక్షల వేళ ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామేపల్లి: విద్యార్థులు పరీక్షల వేళ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మంగళవారం పాతలింగాలలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, స్టోర్ రూంలో నిత్యావసర సరుకుల నిల్వలు, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని సాధనకు శ్రమించాలన్నారు. ప్రణాళికబద్ధంగా సిలబస్‌ను నిర్దేశించుకుని చదివి పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ స్వాతి,ఉపాధ్యాయులు జ్యోతి, జమున, పార్వతీ, శిరోమణి, మంగమ్మ, స్రవంతి, శాల్కు, భద్రమ్మ, రజిత, రమాదేవి పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



చింతగుర్తి సభలో మాట్లాడుతున్న అశోక్

ఖమ్మంఅర్బన్: ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, పంట నష్టం తదితర ప్రభుత్వ పథకాలు అందక అన్ని రకాలుగా నష్టపోతున్న కౌలు రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చింతగుర్తిలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయాన కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పి పట్టించుకోవడం లేదని, మిర్చి దిగుబడి లేక పండిన కాసింత పంటను ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తే దళారీలు, వ్యాపారులు సిండికేట్‌గా మారి సరైన నిర్ణయించకుండా జెండా పాటలు నిర్వహిస్తున్నారని తెలిపారు. క్వింటా మిర్చి రూ.35 వేలు చెల్లించాల్సి ఉండగా.. జెండా పాట ద్వారా రూ.12 వేలకు మించి తీసుకోవడం లేదని, అదనంగా రైతుల వద్ద కమిషన్ కూడా తీసుకుంటున్నట్లు ఆరోపించారు. ఖమ్మంలోమిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అర్హులందరికీ రుణమాఫీ చేయాలని, ఇందిరమ్మ కమిటీల ప్రమేయం లేకుండా ఆరు గ్యారంటీలపై రీ సర్వే చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, మాస్‌లైన్ మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు ధరావత్ లక్ష్మణ్, పాపారావు బాబు, నరసయ్య, శంకర్, దేవల, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొండాయిగూడెం పెద్ద చెరువు పరిశీలన



చెరువు శిఖంలో సర్వే చేపడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కామేపల్లి: మండలంలోని కొండాయిగూడెం పెద్ద చెరువును ఇరిగేషన్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు శిఖంలో అక్రమంగా బావులు తీయించి విద్యుత్ మోటార్లతో నీటిని ఎగువ ప్రాంతాలకు తరలిస్తుండడంతో ఆయకట్టు రైతులకు 'సాగునీరు వరించేనా'శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈఈ రమేశ్ ఆధ్వర్యాన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా చెరువు శిఖంలో ఎన్ని బావులు, మోటార్లు అమర్చారనేదానిపై సర్వే చేపట్టారు. కొందరు అక్రమంగా బావులు తీయించి సుమారుగా 90 మోటార్లకుపైగా అమర్చినట్లు ప్రాథమిక విచారణలో తెలినట్లు సమాచారం. చెరువు శిఖంలో బావులు తీయించి యథేచ్ఛగా సాగు చేస్తున్నా అధికారులు అటు వైపు కన్నెతి చూడకపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇప్పటికీ అధికారులు నామమాత్రపు విచారణ చేపడుతున్నారని, కలెక్టర్ దృష్టి సారిస్తేనే ఆయకట్టు రైతులకు న్యాయం జరుగుతుందని వేడుకుంటున్నారు. ఈ విషయమై ఏఈఈని వివరణ కోరగా..పలువురు రైతులు శిఖంలోనే బావులు తీయించి మోటార్ల ద్వారా నీటిని తరలిస్తున్నట్లు గుర్తించామని, పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. చెరువుల్లో అక్రమంగా బావులు తీసినా, నీటిని తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సర్వేలో వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, లష్కర్ శ్రీను, రాము, నాగేంద్రర్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తిరుమలాయపాలెం: మండలంలోని మహ్మదాపురంలో వృద్ధ దంపతులు, ఒంటరి మహిళలకు చేగువేరా భూపతి ఫౌండేషన్ చైర్మన్ గద్దల చంద్రశేఖర్ మంగళవారం రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వృద్ధులు యాతాకుల పెంటయ్య, ఎల్లమ్మ, అంగడి మంజులతో పాటు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సరితకు నిత్యావసరాలు అందించి ధైర్యం చెప్పారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు సాయం కోసం 97049 65443 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు ఘంటా భీమయ్యా, సబ్బు రామారావు, కొండ సందీప్, గంగాధరి రాధిక, గోపోజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలతో రైతులకు నష్టమే..



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురంలో ఉన్న కెమికల్, ఐరన్ ఓర్ ఫ్యాక్టరీలతో పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయని, మూగజీవాలతో పాటు తాము అనారోగ్యం బారిన పడుతున్నామని బాధిత రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించగా మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ పరిధిలోని వివిధ రకాల పంటలు దుమ్ము, ధూళితో దర్శనమివ్వగా రెండు ఫ్యాక్టరీలను పరిశీలించారు. వైద్యశాఖ అధికారులు గ్రామంలో, వ్యవసాయ బావుల వద్ద నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం గ్రామంలో రైతులు, గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తర్వాత రైతులు వెల్లడించిన అంశాలు, స్థానిక పరిస్థితులపై నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రముఖ సంఘ సంస్కర్త, దళితుల చైతన్యానికి, విద్యాభివృద్ధికి కృషి చేసిన మాదరి భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివని బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్, దళిత నేత వరద నరసింహారావు అన్నారు. మంగళవారం ఖమ్మం బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. కుల వివక్ష, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడుతూ హైదరాబాద్ నిజాంకాలంలో అనేక పాఠశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేసి వేలాదిమంది పేదలకు విద్యను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రముఖ జర్నలిస్టు ఎం.బాబురావు, మాల మహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ దామళ్ల సత్యనారాయణ, నాయకులు కరాటే వేణు, సుదర్శన్ పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లిలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన బొడ్డు మల్సూర్ ఇంటి ఆవరణలోని గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు చెలరేగగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి కాలిపోగా రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన ఆటో..

- ఇద్దరు ప్రయాణికులకు గాయాలు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని యాపిల్ సెంటర్‌లో ఆగి ఉన్న కారును వెనక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరి ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానిక సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. ఇల్లెందు పైపు వెళ్లడానికి సెంటర్‌లో ఆగి ఉన్న కారును ఆటో ఢీకొట్టగా.. ఆటోలో ఉన్న సింగరేణి మండలం మాణిక్యారంకు చెందిన స్వరూపరాణి, యడ్లపల్లి సైదులుకు గాయాలైనట్లు తెలిపారు. కాగా, అదే ఆటోలో ప్రయాణిస్తున్న సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మాజీ మంత్రి నివాళి

ఖమ్మంఅర్బన్: నగరంలోని టేకులపల్లిలో గుండెపోటుతో మృతిచెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పాదిల పాపారావు సతీమణి పార్వతి మృతదేహాన్ని, బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి చెందిన సీపీఐ నాయకుడు పుచ్చకాయల కృష్ణ మనవడు గీతాన్ష్ మృతదేహాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం సందర్శించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, నాయకులు సుధాకర్, కిషోర్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై మిలిటెంట్ పోరాటాలు

ఖమ్మం మామిళ్లగూడెం: రానున్న ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజా సమస్యలపై మిలిటెంట్ పోరాటాలు చేసి ముందుకు వెళ్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ తెలిపారు. మంగళవారం ముస్తఫానగర్ సెంటర్‌లో జరిగిన సభలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యూత్ సభ్యులను సాదరంగా ఆహ్వానించారు. గత కొంతకాలంగా నగరంలో భూ ఆక్రమణలు, భూకబ్జాలు, అభివృద్ధి పేరుతో నాసిరకం పనులు, సామాన్య పౌరులపై దాడులు వంటి సంఘటనకు వ్యతిరేకంగా పార్టీ నాయకులే పోరాటాలు చేసి అక్రమ కేసులు ఎదుర్కొన్నారని చెప్పారు. గతం నుంచే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జబ్బార్, మీరాసాహెబ్, షేక్ బషీర్, వన్‌టౌన్ కార్యదర్శి నాగులుమీరా, నాయకులు హర్షా, రమేష్, శ్రీను, బేగం, బాగం అజిత, పి.రవి, సత్తార్, నాగరాజు, సుధాకర్, రాంబాబు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయం'

ఖమ్మం మామిళ్లగూడెం: ఓటమి భయంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఎమ్మెల్సీ అభ్యర్థులను నిలబెట్టలేకపోయాయని బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని, కార్యకర్తలు కష్టపడి పని చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి, బేతి సుభాష్‌రెడ్డి, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌రాథోడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, యువ మోర్చా అధ్యక్షుడు అనంత ఉపేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతా..

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతానని వరంగల్–ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలంగాణ జన సమితి బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు బ్యాలెట్ నంబర్ 8పై వేసి గెలిపించాలని కోరారు. అనునిత్యం ఉపాధ్యాయ,సామాజిక సమస్యలపై స్పందించి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు, జిల్లా కన్వీనర్ వి.బాబు, నాయకులు ఎస్.కె సర్దార్, బెల్లంకొండ నాగేశ్వరరావు, జంగాపల్లి రవి, బట్టు రాజేందర్ నాయక్, గుర్రాల నాగేంద్రరావు, ప్రసాద్, నరసింహారావు, నాగేశ్వరరావు, జగన్నాథం, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: దళితులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్నెస్పీక్యాంప్‌లోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో నాయకులు పాపిట్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పాలేరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు నాయుడుపేట చౌరస్తాలోని ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సును దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పిఎలుపునిచ్చారు. దళితులపై నేటికీ దాడులు, అత్యాచారాలు, హత్యలు, కుల వివక్ష దాడులు కొనసాగుతూ సామాజిక అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాలేరు డివిజన్ నాయకులు బండి రమేష్, కొమ్ము శ్రీనివాస్, మహేందర్, పగిడిపల్లి వెంకట్రావు, సోమపంగు రాము, పొట్టపింజర స్టాలిన్, ఆరెంపుల ఉప్పలయ్య, సారయ్య, వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం..



ప్రచారం చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: ఈ నెల 23న నాయుడుపేటలో నిర్వహించే కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) పాలేరు డివిజన్ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకుడు శ్రీను ఆధ్వర్యాన మంగళవారం మండలంలో విస్తృత ప్రచారం చేశారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ముఖ్యఅతిథిగా కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ హాజరవుతున్నట్లు తెలిపారు. కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమపాంగు రాము, దాసరి మహేందర్, నాయకులు పల్లి రమేష్, గోపోజు రవి, వెంకన్న, వీరన్న, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనకు కృషి



మాట్లాడుతున్న దోసపాటి శేఖర్

నేలకొండపల్లి: దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వ్యాపార నైపుణ్య శిక్షణను వినియోగించుకోవాలని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ టీ.వీ.చలమయ్య సూచించారు. ఆర్‌సీపీ అండ్ ఎస్‌ఆర్‌డీఎస్, దివ్యాంగుల జేఏసీ సంయుక్త ఆధ్వర్యాన చేపట్టిన శిక్షణను మంగళవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులు ఆయా బ్యాంకుల వద్ద రుణాలు పొంది స్వయం కృషితో ఆర్థిక స్వావలంభన సాధించాలనే ఉద్దేశంతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు దోసపాటి శేఖర్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు సంఘం తరపున అవసరమైన వారికి వడ్డీలేని రుణం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఆరాధ్యదైవం శ్రీలింగమంతులస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న లింగరాజు

ఖమ్మం మామిళ్లగూడెం: యాదవుల కుల ఆరాధ్యదైవమైన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరకు యాదవులు కుటుంబ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ యాదవ సంఘం వ్యవస్థాపక జిల్లా ప్రధాన కార్యదర్శి పరిటాల లింగరాజు పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని దురాజ్‌పల్లిలో నిర్వహించే పెద్దగట్టు జాతర రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర అన్నారు. అనంతరం తెలంగాణ యాదవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల ఉపేందర్ మాట్లాడుతూ.. జాతరలో ప్రజల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఆదమరిస్తే అంతే..!



ప్రమాదంగా ఉన్న మిషన్ భగీరథ ఎయిర్ వాల్ చాంబర్

మండలంలోని రాయిగూడెం ట్యాంక్ సెంటర్ సమీపాన మిషన్ భగీరథ ఎయిర్ వాల్ కోసం ఏర్పాటు చాంబర్‌ప్రమాదకరంగా మారింది. ఆ చాంబర్ సీసీ రోడ్డుకు సమానంగా ఆనుకుని ఉండడంతో అటుగా వెళ్లే వాహనాలు,పశువులు ఏ మాత్రం ఆదమరిచినా అందులో పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– కామేపల్లి